


# నేరము - శిక్ష

కథానిక

రామం చివరిసారి తర్కంలో కాలేజీకి జీతం కట్టడానికే నిశ్చయించాడు. బొత్తాములు లేని పేంటు, వేలాడే పూర్తిచేతుల చొక్కా, చింపిరితల, 'విధాత ఎందుకు పుట్టించాడునన్ను' అన్న నిస్పృహ స్పష్టంగా కనబడే ముఖం: ...ఇదేరూపంతో గత మూడుసంవత్సరాలనుండీ ప్రజకి దర్శనమిస్తూవచ్చాడు రామం. రోడ్డేకుస్తూన్న పేంటునొకచేత్తో పట్టుకుని ముఖంమీద పడే జుట్టును ఎగరేసుకుంటూ మూడో అంతస్తు నుండి రోడ్డుమీదకు దిగాడు, కాలేజీకి పోదామని.

అదో పెద్దభవనం. ఒక ఏభై కుటుంబాలన్నా అద్దెకుంటాయి. ఒక గదికి (చీకటితో సహా) ఒకచిన్నపంచతో కలిపి అయిదు రూపాయలు అద్దె. మరోగదికూడా ఉంటే పదిహేను రూపాయలు అద్దె. ఒక కీచుగొంతు ముసలి దీని యజమాని. ఒకరిచేత ఖాళీచేయించడం,ఇంకోళ్ళని ప్రవేశపెట్టడం, ఆమెనిత్యకృత్యం. రామం రోడ్డుమీదికి రాగానే ఇంటిముందో పెద్దసమూహం ఉంది. "ఏమిటా సమూహం?" అని జనాన్ని తోసుకుంటూ లోపలికి పోయాడు.

కుక్కిమంచం, శల్యాశేషమైన కళేబరంఇల్లాలు దస్తాగిన్నెల్లా ఆర్గురు పిల్లలు, అందులో మరీ చిన్నవాళ్లు ఆమెకొంగుని పుచ్చుకు ఏడుస్తూ ఈంద్రపడుతున్నారు. 'ఖర్ ఖర్' మంటూ దగ్గుతూంది. పాపం! "నన్ను మాత్రం పూర్తిగా చచ్చేవరకూ ఉంచకండి కాస్తోకూస్తో తిరగాడుతూండగానే పూడిస్తే సరి" అనంది. సమూహాన్ని తోసుకుంటూ వచ్చిందో అమ్మాయి. పదిహేడేళ్లు ఉండుంటాయి. సన్నగా పొడుగ్గా ఉంది. కళ్లు మట్టుకు మిలమిల మెరుస్తున్నాయి. చిరిగిన పరికిణీ పట్టుకుని వల్లెవాటు సర్దుకుంటూ మంచందగ్గిరకిచేరింది. 'ఖర్ ఖర్'మంటూ దగ్గి "సీతా!ఏమన్నాడే, డబ్బేమన్నా పెగిలిందా?" అని అడిగింది. సమూహంలోంచి కొంతమంది జారుకుంటున్నారు ఈ తట్టు తమ నెత్తిన పడుతుందనే భయంతో. ఒకధర్మాత్ముడు జేబులో చెయ్యిపెట్టి ఒకరాగికాణీ పదిలంగాతీసి అటూఇటూ తిప్పి మంచంమీదికి గిరవాటేసి దాంతో తన బాధ్యత కాస్తా తీరిందన్నట్లు పోయాడు తృప్తిగా. అర్ధణా మొదలు కాణీవరకూ ఉదారంగా ఇచ్చి వెళ్ళిపోయారు తోటిమానవులు కూడా. "లేదన్నాడమ్మా రేపో ఎప్పుడో ఇస్తాట్ట. సంగతంతా చెప్పినా ఏమీ లాభంలేదన్నాడు 'నిజంగా చచ్చిపోయాడు మా నాన్న" అంటే ఎన్నోసారి నిజం? అన్నాడు" క్లుప్తంగా చెప్పింది సంగతంతా.

ఇల్లాలి ముఖంమీదనే కనబడుతూంది క్షయ జబ్బు. అనుమానం ఏమాత్రం లేదు.

సీత చెప్పిన మాటల సారాంశం అర్థమైంది. "ముసలిముండ ఎంతనిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టింది" అంటూ ఆలోచించకుండానే యాభై రూపాయలు సీత చేతిలోపెట్టి, గిర్రునతిరిగి మేడ మెట్లు ఎక్కుతూ "పంనొమ్మిది, సాలిపేటకోసారి వస్తారు కదూ!" అని గొణిగిన సీత మాటలు మాత్రం అస్పష్టంగా విన్నాడు రామం.

"గోపీ"

రామం గదిచేరుకుని, పాత నులకమంచం మీదకొరిగాడు. మెదడు చాలా నిశితంగా పని చేస్తోంది. ఇందుకు కారణం ఇరవై నాలుగు గంటల నుంచీ కడుపులో ఏమీలేకపోవడమే అని గ్రహించాడు. "కాలేజీ జీతం ఎందుకు కట్టడం?" అన్న విషయంమీద ఆలోచన పోయింది. "నాలుగు ట్యూషన్లు చెబుతూన్నా దేనికీ డబ్బు చాలటం లేదాయె. కరువులో అధికమాసం, రెండుట్యూషన్లు ఎగిరిపోయాయి. మొరటుగా చనిపోయిన తండ్రి మీదహాస్యమాడి, ఇవ్వవల్సినడబ్బు లేదంటే అంతకన్నా న్యాయం మరేం లేదన్నట్లు సీత ఎలా ఊరుకోగల్గింది? ఇది సహనమా?...లేక జాతిలో విచక్షణా భావం, ఆలోచనా శక్తి మందగిస్తోందా?" అని ఆలోచిస్తూ టీకొట్టుకి పోయేందుకు నాలుగణాలు పోగుచేశాడు గది వెతికి.

రామానికి ఆ మహానగరంలో ఉన్న సందులు గొందులు దగ్గరనుంచీ, కంఠోపాఠంగా తెలుసు. కాని చాకలి, మంగలి, హోటలు ఇత్యాది వ్యతిరేక శక్తులు చాలా ఉండటాన్ని ముందు రాస్తా నిర్ణయించుకోకుండా బయలుదేరితే, ఖర్మంకాలి అప్పులవాడెవడన్నా ఎదురుపడితే, ముఖం వాచేట్టు చీవాట్లు తినాలి. టీకొట్టు చేరి "పేదల పాలిటి పెన్నిధి" కప్పు టీని సేవించి, మళ్లీ గదివైపు నడక మొదలుపెట్టాడు. "కాలేజీ జీతం కట్టలేదని తెలుస్తే ఉన్న రెండుట్యూషన్లూకూడా పోతాయి. 'పీడా పోయె' 'దగ్గితే ఉండని ముక్కు తుమ్మితే ఉంటుందా?'"... ఇన్నీ ఆలోచిస్తూన్నా మనస్సు "సీత" మీదికి పోవడం మొదలుపెట్టింది. కరువురోజుల్లో ప్రేమించడం లేదు కదా? డబ్బుతో మూలుగుతూన్న వాళ్ళకలాంటి వికారాలు గాని, అలాంటిభయం తనకేమీలేదని తెలియగానే, మళ్ళా స్వేచ్ఛగా ఆలోచన మొదలుపెట్టాడు..."సీత పందొమ్మిది సాలిపేటకి రమ్మంది. ఎందుకని? ఇంత చిన్న వయస్సులో అంత సహనం ఎల్లా అబ్బింది? ఎందుకన్నా మంచిదిపోయి కనుక్కుందాం." అని మనస్సులో "రోడ్డుమేప్" తిరగ వెయ్యగానే, రాస్తా దొంకి ది లైన్ క్లియర్ అని తెలియగానే

"రండి! దయచేయండి! మా గృహం పావనమైంది" అని ఆహ్వానించింది సీత. గదిలో ప్రవేశించకుండానే "ఈ మెనాటకం వెయ్యటం లేదు కదా" అనుకున్నాడు.

"అల్లా నిలపడిపోయారేం?" అని హెచ్చరించింది కాని రామానికి ముందడుగు పడలేదు.

మీలాంటి దయార్ద్రహృదయులు ఇంకా ఉండబట్టే బ్రతికిపోయాం అని చదివింది. మాటల ఒత్తిడే కాని మనస్సులోంచీ రావడం లేదు మాటలు. ఎర్రగన్నేరు పువ్వులసిగ, పాత సిల్కు చీర, ఒత్తుగా పౌడరు, రంగుకాగితాలు, నిలువుటద్దం పందిరమంచం చూచేసరికి సీత జీవిత కలాపం అర్థమైంది.

"ఇందుకా గమ్మంది?" అని కుర్చీలో కూలబడ్డాడు తెల్లబోయి...

"టీ తెస్తానుండండి" అని గాజుగ్లాసు పట్టుకుపోయింది చరచరా...బ్రతుకు జీవుడా అనుకున్నాడు రామం.

అప్పులెగేశాడు డబ్బులేక. తప్పించుకు తిరిగాడు ఆత్మాభిమానం చంపలేక. విద్యకోసం ఎన్నో పడిగాపులు పడ్డాడు. కాని ఇదో నూతనానుభవం. "ఆమె వచ్చేలోపల ఉడాయిస్తే నయమేమో!" కాని విషయం తుదిదాకా తెలుసుకోవాలన్న వాంఛ. తల్లెక్కడ? తక్కిన పిల్లలంతా ఎక్కడ? ఇలాంటి ప్రశ్నలకి జవాబు కనుక్కోవాలన్న కుతూహలంతో అల్లాగే ఉండిపోయాడు.

టీ తెచ్చి చేతికందించి తన సన్నని వేళ్ళని రామం చింపిరిజుత్తులోంచి చనువుగా పోనిచ్చింది.

అలా కూర్చో అని కటువుగా ఆజ్ఞాపించాడు. తప్పుచేసినట్టు మంచంమీద ఓమూల కూర్చుంది, అర్థంలేని మందహాసం పారేస్తూను.

"మీ అమ్మ ఎక్కడ?" అని అడిగాడు.

"స్వర్గంలో!" అంది బహు తేలిగ్గా.

నోరు వెళ్ళపెట్టాడు రామం, తరువాత ఏమనాలో తెలీక.

"మీ ధర్మమాయని, మీరిచ్చిన రూపాయల మూలాన్ని ఇద్దర్నీ సమాధి చేయదల్చాం. మీ మేలు మరిచిపోలేం."

"పిల్లలు?" అని అడిగాడు ముక్తసరిగా.

వాళ్లు కొనకున్నారు. చూస్తారా?" అని తలుపు తెరిచింది కనకింటిది. ఆ చిన్నగదిలో ఆరుగురు పడుకుంటారని తెలీగానే కళ్ళు తిరిగాయి రామానికి. వెళ్ళొస్తానని మెట్లు గబగబా దిగిపోయాడు.

"మళ్ళా వస్తారా?" అనిమాత్రం అనగల్గింది. "ఎందుకొచ్చినట్లు?" అనుకుంది. కాని, అర్థం కాలేదు రామం ప్రవర్తన.

మళ్ళా తన కూపం చేరుకొని కుక్కిమంచం మీద సాగిలపడ్డాడు. రామానికి గణితశాస్త్రమందు అభిమానం మెండు. పాత బాకీలన్నీ కలిపి చూచాడు. ఏభయి రూపాయలవరకూ తేలింది. ఉన్నాయని కాదు. తేగలడని అంతకన్నా కాదు "ఏదొందలు ఉంటేనా?" అనుకున్నాడు...వ్యర్థప్రగల్భాలెందుకని మళ్ళా ఊరుకున్నాడు. ఇంతకీ "ఎంత మంచి అభిప్రాయాలున్నా అదో గతి పాలై పతితులు కావడానికీ; ఎంత దురుద్దేశాలున్నా గొప్పగా ప్రకాశించి పేరు పొందడానికి విధి వ్రాతే కారణమా? అంతకన్నా రేషనల్ సంజాయిషీ ఏదన్నా ఉన్నదా?" అని తీవ్రంగా ఆలోచించాడు. మళ్ళా సీత జీవితం గురించే ఆలోచిస్తూ నిద్రలో మునిగిపోయాడు.

"నిద్రనుంచి లేవడమా? మానడమా? పడుకుంటే గదా లేవడానికి, పోనీ లేచినా ఏం చెయ్యాలి?" అని ఇంకా ఆలోచిస్తూండగానే తలుపు 'బడబడ' మని బాదింది కీచుగొంతున ముసల్ది. నానాశ్రాద్ధాలూ పెడుతూన్నది అవతల నుంచి, అద్దెకోసమని. ఆమె గొంతుకంటే ఎక్కడ లేని భయం రామానికి. మెల్లగా లేచి చింకి పిలికల్ని చెండులు చుట్టి చెవుల్లో కుక్కుకుని, తాపీగా తలుపు తెరిచాడు.

"ఈ తలుపు మళ్లా చేయించడం కష్టం ఈ కరువు రోజుల్లో" అన్నాడు నవ్వుతూ అకస్మాత్తుగా తలుపు తియ్యడంవల్ల మీదపడ్డ ముసలిదాని ముఖం నేలని ముద్దుపెట్టుకోకుండా ఆపి. గిరి తెగిన గ్రామఫోను ప్లేటులా వాగింది. నానా శ్రాద్ధాలూ పెట్టింది. ఆర్నెల్ల అద్దె ఆ వేళ ఇవ్వకపోతే సామాన్లలాగే ఉంచి ఖాళీచేసి వెళ్ళమంది. చిరునవ్వుతో విన్నాడు ముసిలిదాని వాగుడు. "అసలు రెణ్ణెలు కూడా అదె కటకుండా ఎవరినీ ఉండనివ్వదే? ఆర్నెళ్లు నన్నెలా ఉపేక్షించింది" అన్న సమస్యని గురించి ఆలోచిస్తూన్నాడప్పుడు. అన్ని సామానులు అలాగేవుంచి వెళ్ళమన్నది ముసిలిదాని పాతపాట. అందుకని పట్టించుకో లేదు. అసలు సామానులనేవి ఉంటేగదా వదిలీడానికి! ఉన్న సామానంతా పాత సిగరెట్ పీకలు, చిగిరిన ముఱికిగుడ్డలు, పుస్తకాలు. కాని వీటన్నిటికంటే, విడిపెట్టిపోలేని పెంపుడు జంతువులను నాశనం చేస్తారే అన్న ఒక్క విచారం తప్ప మరేం కలగలేదు రామానికి. "సాలీళ్లు నిర్భయంగా గూళ్లుకట్టుకున్నాయి. బొద్దెంకలు స్వేచ్ఛా విహారం చేస్తున్నాయి. నల్లులు తన నిర్భాగ్యపు శరీరంమీద ఎలాగో బ్రతుక్కొస్తున్నాయి. వీటన్నిటికీ ఆటకట్టవొచ్చు..."

ఇలా ఆలోచిస్తూనే పరధ్యానంగానే వీధిలోకి వచ్చి, తిన్నగా సీత యింటికి దారితీశాడు. తలుపుతట్టిన అరగంటకుగాని తెరవలేదు. ఆ తలుపు తియ్యడం కూడా, ఒక బొద్దుమీసాల తాగుబోతు వెళ్ళిపోవడానికి తీసింది. 'జీవితం' అంటే పరమరోత వేసింది.

"రండి దయచేయండి" అని యథాప్రకారముగా చిరునవ్వుతో ఆహ్వానించింది; వెళ్ళియథాస్థానంలో కూర్చున్నాడు-నల్లుల కుర్చీలో.

"రారేమో మరెప్పుడూ అనుకున్నా" నంది యథాలాపంగా. కొంచం కటువుగానే అన్నాడు "సీతా! నీకోసంరాలేదు గుర్తుపెట్టుకో. ఎక్కడో ఒకచోట కొంచెంసేపు కూర్చోవాలి. అందుకని ఇలా వచ్చాను" సీతకదేమీ అర్థంకాలేదు. రెండు నిముషాలెవ్వరూ మాట్లాడలేదు.

"అసలు ఇంతకన్నా గత్యంతరం లేదానీకు?" అని అడిగాడు. సీత జవాబు అనవసరం అన్నట్లో చిరునవ్వు పారేసి కూర్చుంది.

"అసలు నువ్వీ వృత్తిలో ఎలాదిగావో చెప్పు" అన్నాడు మళ్ళీ.

ఆమెకు ఇదంతా ఎందుకో అర్థం కాలేదు. చాలామంది మగవాళ్లు మాటలమధ్య అడిగేవారు. ఏవో కొన్ని అబద్ధాలుచెప్పి వాళ్ళని తృప్తి పరచేది. కాని రామం ధోరణి వేరు అనిపించింది.

"మీకు వినాలనివుందా? సరే మూడుముక్కలలో చెప్పేస్తా" అని ఆరంభం చేసింది.

"తిండికి ఇంటికి రావడం, ఊరంతట తిరగడం ఇల్లా గడిచింది నాకు మిడిమిడి జ్ఞానం వచ్చేవరకు నాన్నొక్కడే కష్టపడి సంపాదించేవాడు. ఇంత లోనే ఏమైందో కూలీకూడా దొరకడం మానేసింది. ఇంట్లో తిండి దొరకడం కష్టమైంది. అమ్మ కూడా కూలికి బయలుదేరింది. కాని కష్టానికి ఫలితం లేకపోయింది. నా జీవితంలో జరిగిన ఒకటి రెండు విషయాలు తలుచుకుంటే, అమ్మ సేవికా వృత్తిలో ఎంతకష్టం పడాల్సివచ్చిందో సులువుగా అర్థమైంది. ఒకనాడు మా నాన్న తప్ప తాగి వచ్చాడింటికి. ఇంట్లో రెండురోజులుబట్టీ తిండిలేదు సరిగ్గా ఆ రోజే ఇల్లు ఖాళీ చెయ్యమని ముసల్ది ఒత్తిడి, దానితో మరీ చిక్కేర్పడింది... ఆవేళనుంచీ చచ్చిపోయేవరకూ త్రాగడంమాత్రం మానలేదు మా తండ్రి.

"నాకు పదోఏడు రాగానే, ఊరంత బాధ్యత నెత్తినపడింది. నేనూ సేవికావృత్తికి బయలుదేరాను. అమ్మకూడా అప్పుడప్పుడే పొడిదగ్గులా బయలుదేరింది. తిండే లేకుండాపోతూంటే మందు కూడానా? నా చిన్నవయస్సు అందరికీ కన్నెర్ర యింది. హాస్పిటల్లో, జమీందారింట్లో, హోటల్లో ఎక్కడా నన్ను కోరారుకాని, నా సేవికావృత్తిని కాదు. మొదట్లో బాధపడ్డాను. అమ్మనిగురించి నీచంగా మాట్లాడి "నువ్వుమాత్రం పాతివ్రత్యం చేస్తావా?"అని తూలనాడింది లోకం. దాంతో ఒకనాడీవృత్తిలో జొరబడ్డాను. తల్లినీ తమ్ముళ్లనీ ఒక ఏడాది స్వేచ్ఛగా పోషించాను..."అని ఏదో చెప్పబోయి ఊరుకుంది. ఆమె కథచెప్పిన క్షణం, మార్పుకి పూర్వం ఉన్న సీతని, మేలిముసుగు లోంచి చూసినట్లు చూచాడు రామం. మళ్ళా తెరపడింది.

"కత్తులబోనులాంటి పరిస్థితుల్లో వ్యక్తిత్వానికి స్థానంలేదు. 'నుదుటివ్రాత'అనుకోడం తప్ప. అని "వెళ్ళొస్తాను"అని శెలవుతీసుకుని వీధిలో పడ్డాడు ఆలోచనలు తెరతెరలుగా రావడం మొదలుపెట్టాయి.

రామం జీవితంతో పడుతూన్న బాధ, వారం నుంచీ చూస్తున్న సంఘటనలు, మనస్సుని కలచివేశాయి. డబ్బుమీదుండే కాపీనంతో, మరు కారంతో, లోభత్వంతో అమానుషంగా ప్రవర్తించే కుత్సికులు, వ్యక్తులని కుటుంబాలనీ నిర్దాక్షిణ్యంగా నాశనంచేసే విధానాన్ని చూచాక ఏదోతెలీని ప్రతీకారంకోసం బాధపడ్డం మొదలు పెట్టాడు. "ఈ ప్రతీకారం ఎవరిమీద? ఎలా సాధించగలం?" అని ఆలోచిస్తే హింసాకాండ మీదకు పోయుండేదిగాదు మనస్సు. ఆలోచనాశక్తి తప్పుదారిపట్టి రానురాను విషయాలను తలక్రిందుచేస్తూ తూనికదప్పి నడవడం మొదలుపెట్టింది. సంఘంలో దురాచారాలు, నిర్దయ, పరపీడ, వీటినిగురించి సూత్రప్రాయంగా ఆలోచించ వీలుకాదు కాబట్టి తన సిద్ధాంతాలని ముసలిదానిమీద ప్రతిక్షేపించేడు. డబ్బుకి ఉపయోగం లేకపోయినా ముసల్ది ఇల్లు ఖాళీచేయించడం, నిర్దాక్షిణ్యంగా పీడించడంగురించి ఆలోచిస్తూంటే సిద్ధాంతాలు వెనకపడి, "ఈ ముసిల్దిచస్తే కీడు మూడుతుంది."అన్న దురూహలో పడిపోయాడు. పెద్దవర్షం కురియగానే కొండవాగు బండరాళ్లని దొర్లించుకొనిపోయి ఎక్కడెక్కడో పడేస్తుంది. దీనికో ఆలోచనలేదు. 'వడి, శక్తి' రెండున్నాయి. అదేపరిస్థితిలో కొచ్చాడు రామం.

చీకటిపడేవరకూ అక్కడక్కడ తిరిగి ఏదో త్రోవలో కడుపునింపి, ఇల్లుచేరాడు. ప్రొద్దున్న ముసల్దిచ్చిన 'సలహా' గురించి ఆలోచించాడు. "ఖాళీచేసి ఎక్కడికిపోవడం...? ముసలిముండ, ఇందర్ని ఉసురుపెట్టి, అద్దెలు వసూలు చెయ్యకపోతే ఏం మునిగిపోయింది? ఎవరున్నారు కాబట్టి దీనికి తినడానికి? ఆ మేనకోడలు ముందుందంటే, దీనికంటే కర్కోటకురాలు దానికోసం అందర్నీ ఉసురుపెట్టి ఈ ఆస్తి జాగ్రత్త పెట్టడం." హింసా కాండంటే రామానికి తగని అసహ్యం. కాని మూడు రోజులబట్టీ, విడిచిపెట్టకుండా ఒకే ఆలోచన బుఱ్ఱలో ప్రవహిస్తూంది. యథాలాపంగా అనుకున్నా డోసారి, "ముసలిదాన్ని చంపిచేస్తేనో"అని. అదే కోరిక రోజుకు రోజూ బలపడుతూంది. మరో కారణం కూడాను. ఆ మేనగోడలు ముండ ఇంటిదగ్గర లేదు. సీత ఇంటి నించి వస్తూ, టీ త్రాగుతూ, మురికి గొంగళీ ముఖంమీదనుంచీ రప్పుకుని అదే ఆలోచించాడు. "చంపితే ఏం?" అనుకున్నాను. "పిసినారిముండ ఎంగిలి చేత్తో కాకిని కొట్టదు." "నేనే ఎందుకు

చెయ్యాలి?"..."చెయ్యక చేసేదేముంది?"... "ధనిక వర్గానికో పాఠం చెప్పాలి"..."అన్నిటి కంటే సీతకో యింత డబ్బిస్తే, తప్పుకుదారి కాస్తా విడుస్తుందేమో!" ఇల్లా ఏవేవో ఆలోచించాడు. పెద్దకలలు కన్నాడు. కల్లో ఎవరిదో శవం. ఉరికంబంనుంచి వేలాడుతూన్నట్లు చూచి తనదేనని, గాభరాపడి గడల్లా వెతికాడు.

తెల్లవారుఝామైంది. చల్లటిగాలి ఆ గది గుండా కూడా వచ్చింది. "పది గంటలకి మేనకోడలు వచ్చి పడుకుంది. చేయదల్చుకుంటే తెల్లారకుండానే చేసి పారేయాలి. ఉన్న స్వల్ప కాలం వృథా చెయ్యకూడదు. ముసలిది బయటికి వచ్చే టైంకూడా ఐంది. తలుపు పక్కగా నిలబడతాను, తలుపు తియ్యగానే పడున్నట్లు లోపల జొరపడతాను. ముసలిది గాభరాగా లోపలికి వస్తుంది. తలుపునువేసే తాటిపట్టె అక్కడే ఉంటుంది." అని వణుకుతూన్న దేహంతో రెండో అంతస్తులో ముసలిదానిగదిదగ్గరకిచేరాడు.

* * *

రాత్రి నిద్ర చాలనందువల్ల ఇంకా ఎర్రగా ఉన్న కళ్ళతో తలుపు తెరిచింది రామానికి అంత తెల్లారకుండా ఎందుకొచ్చాడో తెలీకపోయినా యథాప్రకారం "దయచేయండి" అని ఆహ్వానించింది. "ఇదిగో డబ్బు, చాలాఉంది. ఇటుపైన వ్యభిచారంమాని గౌరవంగా బ్రతుకు" అని ఆజ్ఞాపించి ఒకమూట మంచంమీదికి గిరవాటేసి వెళ్ళిపోయాడు. పిలిచినా వినిపించుకోలేదు.

కర్తవ్యం ఇప్పుడు సూటిగా కనబడుతూంది రామానికి - పోలీస్ స్టేషన్‌కిపోయి పట్టుపడ్డం. ప్రతీకారం పోటుపెడుతూంది, తన ఘాతుక కృత్యం తలుచుకుంటే, ప్రవాహం వడి తగ్గిపోగానే బుర్ర పనిచేయడం ప్రారంభించింది. "ముసలిది చస్తే అంతకన్నా కరోకటురాలు ఆ మేనకోడలు, నన్నూ సీతనీ కాకపోతే మరో అభాగ్యుల్ని గెంటిస్తూనే ఉంటుంది మరొకళ్లు వస్తూనే ఉంటారు. పరపీడ, ప్రభుత్వచట్టం ప్రకారం జరుగుతూన్నంతకాలం, సంఘంలోని దురాచారాలు కట్టుబడటం కల్ల. సంఘంలో పరిపాలించే విధానంలో ఉన్నదౌష్ట్యం, వ్యక్తుల్లో నని భ్రమపడి వారిని నాశనంచేస్తే "విధానాలు" నశిస్తాయని నమ్మటం ఒకానొక మత్తులో ఆ వ్యక్తినికాని వ్యక్తులనుగాని నాశనం చేయటం వ్యతిరేకశక్తులకి బలంచేకూర్చటం అని గ్రహించాడు. ఈ పెద్దపొరపాటు గ్రహించాక తల నుండి మొండాన్ని వేరుచేస్తేగాని శాంతిలేదనుకున్నాడు. తన ఘాతుకకృత్యం ఎంతమంది అమాయకులని అణిచివెయ్యడానికి త్రోవతీస్తుందో కూడా ఊహించాడు...ఐనా ఇవన్నీ ఆలోచించేందుకు టైంలేదనుకుంటూ పోలీస్‌స్టేషన్ వైపు నడకసాగించాడు.

* * *

సీత కళ్లునులుముకుంటూ మూటవిప్పేసరికి చిల్లర, నోట్లు కళ్ళని మిరుమిట్లు కొల్పాయి. రామానికి ఇంతసొమ్మెలా వచ్చిందనిగాని తన కెందుకిచ్చాడనిగాని ప్రశ్న రాలేదసలు. జేబులు కత్తిరించి ఆమెకౌగిల్లో గడిపినవాళ్లు, భార్య మంగళసూత్రం కుదువపెట్టి త్రాగి ఆమెననుభవించినవాళ్లూ బందిపోటుదొంగలూ ఎందరో ఆమెలోసిగ్గుని, స్త్రీత్వాన్ని, వెలయిచ్చి పుచ్చుకున్నారు. ఆమెఎవ్వరినీ "నీకీ డబ్బెలావచ్చింది?" అని అడగలేదు. ఆమెనికూడా ఎవరు "నీకీడబ్బెవరిచ్చారు?" అని అడగలేదు. "బతకాలంటే డబ్బుకావాలి. ఏలావచ్చినాసరే" అదొక్కటే తెలుసు ప్రస్తుతానికి...

కాని ఎన్నింటిలో ఈవేదాంతం పనికొచ్చినా రామం ఇచ్చిన డబ్బులోమాత్రం పనికిరాలేదు. రక్తం మరకచూడగానే డబ్బెల్లావచ్చిందో సుమారుగా అర్థమైంది. తనకోసం రామం ఉరికంబాన్నెదిరించాడని తెలియగానే, సీతలో ఎన్నాళ్ళ క్రిందటో కృశించి నిద్రపోయిన, స్త్రీత్వం, ప్రేమ, క్షణమాత్రం మేలుకున్నాయి.

(ఆధారం: డాస్టవిస్కీ)

---

మానవచరిత్ర క్షుణ్ణంగా చదివితే, శతాబ్దాలతరబడి యీ మనుషులంతా-ప్రభుత్వాలు తమను అనవసరంగా పెట్టే బాధల్ని ఇంత ఓర్పుతో ఎందుకు సహిస్తున్నారా అన్న ఆశ్చర్యం ఒక్కటే మిగులుతుంది. —బోరా